


రామేశ్వరంపల్లి గ్రామం

భూమి లెక్కలు ఎక్కడా?

- అస్తవ్యస్తంగా గ్రామకంఠం
- 35 ఏళ్లుగా రివిజన్ మాటెత్తని సర్కార్
- ఇదే అదనుగా ఎక్కువ కొలతలతో రిజిస్ట్రేషన్లు
- గ్రామాల్లో పెరుగుతున్న వివాదాలు

దుబ్బాక, జూన్ 4: మల్లయ్య చాలా ఏళ్ల క్రితం తన ఇంటి పక్కన ఖాళీ స్థలాన్ని ఓ కాగితం రాసుకుని కొనుగోలు చేశాడు. అప్పుడే అక్కడ ఇల్లు కట్టుకున్నాడు. ఇల్లు పాతదైపోవడంతో ఇప్పుడా స్థలంలో కొత్త ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు ఇచ్చేందుకు భూ యాజమాన్య పత్రాలు అవసరం అయితే అవి ఇచ్చే వారు లేకపోవడంతో భూమి ఉన్నా ఇల్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు.

2020కి పూర్వం సరైన ధ్రువపత్రాలు లేకుండా ఇళ్లు కట్టుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాత ఇంటి స్థానంలో కొత్త ఇల్లు కట్టాలన్నా.. అన్నదమ్ముల మధ్య పంపకాలు జరిగినా యాజమాన్య పత్రాలు లేక పోవడంతో వారికి అనుమతులు రావడం లేదు. గతంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు గ్రామ కార్యదర్శి సర్వే, విచారణ జరిపి తాత్కాలిక ఇంటి నంబర్ కేటాయించేవారు. ఆ తర్వాత ఆ భూముల వివరాలను పోర్టల్ చేర్చి.. వివాదం లేకుంటే శాశ్వత ఇంటి నంబర్ ఇచ్చేవారు. అయితే, ప్రభుత్వం తామే వ్యవసాయేతర భూములను గుర్తించి, ఇంటి యజమానులను నమోదు చేస్తామని కొత్త పాలసీ తీసుకుంది. ఇందుకోసం 2020లో టీఎస్ఎన్‌పీబీ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించింది. సిద్దిపేట జిల్లాలో సుమారు 2లక్షలకు పైగా ఇండ్లను గుర్తించినట్టు ప్రభుత్వం రికార్డులల్లో ఎక్కించింది. జిల్లాలోని 499 గ్రామాల్లో ఈ సర్వే జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ భూమి, కార్యాలయాలు, వాటర్ ట్యాంకులను గుర్తించి రికార్డుల్లోకి ఎక్కించారు. అయితే, వాటి కొలతను పూర్తిస్థాయిలో తేల్చకుండానే కథ కంచికి చేర్చారు. గ్రామకంఠంలోని వ్యవసాయేతర భూమిని గుర్తించినప్పటికీ, వాటిని సరిదిద్ది ఇంటి నంబర్లు, యాజమాన్య పత్రాలు అందించలేదు. సర్వే అశాస్త్రీయంగా

మిగతా 8వ పేజీలో

కలగానే కార్పొరేషన్

- సిద్దిపేట మున్సిపాలిటీకి దక్కని హోదా
- ఓటర్లు పెరిగినా వార్డులు పెరగని వైనం

సిద్దిపేట మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా కల్పించడానికి గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. కార్పొరేషన్ హోదా కోసం ప్రతిపాదనలు పంపించేలా సమాయత్తం చేశారు. దీంతో వచ్చే మున్సిపల్ ఎన్నికలు కార్పొరేషన్ ప్రాతిపదికగానే జరుగుతాయని అంతా భావించారు. లేదంటే పెరిగిన జనాభాతో వార్డుల సంఖ్యనైనా పెంచుతారని ఊహించారు. కానీ రెండు విషయాల్లోనూ నిరాశే ఎదురైంది. ఇక మల్లన్నసాగర్ నిర్వాసిత కాలనీలను గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో పట్టణ పరిధి పెరిగింది. అయితే అందుకు తగినట్లుగా వార్డుల సంఖ్యను విభజించకపోవడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట జూన్ 4

- వచ్చే ఎన్నికల్లోనూ 43 వార్డులతోనే సరి
- శివారు గ్రామాల్లో ఇక పంచాయతీ ఎన్నికలే
- కొత్త జాబితాలో కానరాని గజ్వేల్- ప్రజ్ఞాపూర్ వార్డుల పెంపు
- మల్లన్నసాగర్ గ్రామాలు విలీనమైనా ప్రస్తావనేది..?



రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు, పాత మున్సిపాలిటీల్లో జనాభా అంచనా ఆధారంగా వార్డులను పెంచడం, విభజించడం చేపట్టాలని మంగళవారం పురపాలకశాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేసింది. మున్సిపల్ కార్పొరేషన్లలోని వార్డుల విభజన సైతం ఇందులో చేర్చారు. గతంలో పంచాయతీలుగా ఉన్న మేజర్ గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు తుది జాబితాలో చేర్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ఈ నోటిఫికేషన్ విడుదలైంది. అయితే, ఇటు సిద్దిపేట.. అటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు తాజా నోటిఫికేషన్‌లో చోటు దక్కలేదు.

మళ్లీ 43 వార్డులతోనే సిద్దిపేట

ఒకప్పుడు సిద్దిపేట మున్సిపల్‌లో ప్రశాంత్‌నగర్ గ్రామపంచాయతీని విలీనం చేశారు. ఆ తర్వాత లింగారెడ్డిపల్లి, రంగధాంపల్లి గ్రామాలను చేర్చారు. దీంతో వార్డుల సంఖ్య 30 నుంచి 43కు చేరింది. ప్రస్తుత పట్టణంలో 1.50లక్షలకు పైగానే ఓటర్లు ఉన్నట్లు అంచనా. వార్డుకు 3వేల ఓటర్ల చొప్పున విభజిస్తే 50 వార్డులు పెరుగుతాయని భావించారు. కానీ తాజా జాబితాలో సిద్దిపేట వార్డుల పెంపు గురించి ప్రస్తావించలేదు. దీంతో వచ్చే ఎన్నికల్లోనూ 43 వార్డుల ప్రాతిపదికనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

ఆ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలే

సిద్దిపేట మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారిస్తే అభివృద్ధి చెందడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరయ్యే

మిగతా 8వ పేజీలో

మన కోడెలు పదిలమేనా

- కొమురవెల్లి మల్లన్నకు మొక్కుబడులుగా సమర్పణ
- గతంలో వేలంపాట... వ్యాపారులు కబేళాలకు తరలింపు
- గుట్టుచప్పుడు కాకుండా పక్కదారి
- గోశాలకు అప్పగింతతో సజావుగా నిర్వహణ
- 160 ఎకరాల భూమి ఉన్నా.. పచ్చగడ్డి కరువు

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ లోపంతో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిధిలోని గోశాలలో కోడెలు మృత్యువాతపడుతుండడం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అందరి దృష్టి జిల్లా పరిధిలోని కొమురవెల్లి మల్లన్న ఆలయ కోడెల సంరక్షణపై మళ్లింది. కొమురవెల్లి మల్లన్నను గొల్లకురుమలతో పాటు ఇతర సామాజికవర్గాలు ఇలవేల్పుగా కొలుస్తున్నారు. తమ కోర్కెలు ఈడేర్చినందుకు భక్తులు ఆర్జిత సేవలు నిర్వహిస్తూ, తలనీలాలు సమర్పించి, పట్నాలు రచించి, వస్త్ర, సామగ్రి, నగదు విరాళాలు అందించినట్లుగా పలువురు కోడెలు, గొర్రెలు, మేకలు, గోవులను మొక్కుబడులుగా ఆలయానికి అందజేస్తుంటారు. గతంలో ఆలయాధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించిన క్రమంలో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి కబేళానికి తరలించేవారు. దీంతో మూగజీవాలను విక్రయించేందుకు తాము మొక్కుబడిగా అందించడం లేదని, తమ మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆందోళన చేపట్టడం వివాదాస్పదమైంది. ఈ విషయమై గతంలో 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించడంతో అప్పటి కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డి స్పందించి కోడెల వేలం పాటను పూర్తిగా నిలిపివేయించారు. సంరక్ష గోశాలకు తరలించాలని నిర్ణయించడంతో కొన్నాళ్లు హైదరాబాదులోని ఓ ఫౌండేషన్‌కు పంపించారు. కొంతకాలంగా జిల్లా పరిధిలోని కొండపాక గోశాలకు అందజేస్తున్నారు. కానీ ఆలయాధికారుల పర్యవేక్షణలోపం, పట్టింపులేనితనంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది కలిసి రాత్రివేళల్లో గుట్టుచప్పుడుకాకుండా విక్రయిస్తూ పట్టుబడిన సందర్భాలూ ఉన్నాయి. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టక నిర్వహణ భారం పేరిట చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం మల్లన్న ఆలయంలో 1 పాడి ఆవు, 10 కోడెలు, 4 దూడలు ఉన్నాయి. వీటిని ఆలయ తోటబావి ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశంలో షెడ్డులో సంరక్షిస్తున్నారు.

160 ఎకరాల భూమి ఉన్నా పచ్చగడ్డి కరువు

కోడెలు, గోవులు, దూడల సంరక్షణ నిమిత్తం ఇరువురు సిబ్బందిని నియమించి ఓ ఉద్యోగికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. వాటిగ్రాసం కోసం ఎండుగడ్డి కొనుగోలు చేస్తున్నారు. కొరత ఉన్న సమయంలో అధిక ధర కానీ ఆలయానికి కొమురవెల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో 160 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం, హద్దుల నిర్ధారణ చేసుకోకుండా గాలికి వదిలేయడంతో కనీసం పచ్చగడ్డికైనా నోచుకోలేని దుస్థితి నెలకొనడంతో కోడెల సంరక్షణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయాధికారుల దిద్దుబాటు చర్యలు

వేములవాడ ఘటన అనంతరం ఆలయ ఈవో అన్నపూర్ణ ఇటీవల తోట బావి ఆవరణలోని గోసంరక్షణ ప్రదేశాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయా పరిణామాల నేపథ్యంలో ఆలయాధికారులు కోడెలు, గోవుల సంరక్షణకోసం పచ్చగడ్డి సాగుకు ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


మల్లన్న ఆలయ తోటబావి సమీపంలోని షెడ్డులో ఉన్న కోడెలు



సిద్దిపేటలో అరుదైన ఉత్సవం

- నేడు సువర్చల హనుమత్ కల్యాణం

సిద్దిపేట కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట మార్కెట్ చౌరస్తా వద్దనున్న వీర హనుమాన్ ఆలయం ఎదుట నేడు సువర్చల హనుమాన్ కల్యాణం నిర్వహించనున్నారు. 14ఏళ్ల క్రితం రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సిద్దిపేటలో ఈ కల్యాణోత్సవం ప్రారంభమైంది. హనుమంతుడు బ్రహ్మచారి అని తెలుసు. కానీ నవబ్రహ్మలలో ఒకరిగా కావడానికి దేవతల ఆదేశం మేరకు లోకరక్షకుడైన సూర్యుని ఆత్మపుత్రిక సువర్చలాదేవిని హనుమంతునికి ఇచ్చి వివాహం జరిపించినట్లు పురాణాలు చెబుతున్నాయి. లోకకల్యాణం కోసం బ్రహ్మచర్యానికి భంగం కలగకుండా వీరి అరుదైన వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో 14 సంవత్సరాల నుంచి సిద్దిపేటలో సువర్చల హనుమత్ కల్యాణం వైభవంగా జరుగనుంది. కల్యాణోత్సవం అనంతరం అమ్మవారికి బియ్యం సమర్పణ, అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.

అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం వల్ల భూ సంబంధిత సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం కొండపాక మండలం ఖమ్మంపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. అందుకోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి సదస్సుల్లో దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మర్పడగ నుంచి ఖమ్మంపల్లి వరకు, సిద్దిపేట నుంచి ఖమ్మం పల్లి వరకు బీటీ రోడ్డు వేయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పంపిణీ చేయకుండా ఉన్న 19 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించాలని కోరారు. అందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, కొండపాక తహసీల్దార్ శ్యాం, ఆర్ఐ బాలకృష్ణ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


దరఖాస్తులు అందజేసిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను బుధవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆర్సీపురం సహాయ పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


మృతదేహాన్ని తరలించేందుకు యత్నిస్తున్న పోలీసులను అడ్డుకుంటున్న కుటుంబీకులు, గ్రామస్థులు

కారు ఢీకొని వ్యక్తి మృతి

- న్యాయం కోసం మృతుడి బంధువుల ఆందోళన

తొగుట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన తొగుట మండలం తుక్కాపూర్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన గంట కనకయ్య (48) బుధవారం తుక్కాపూర్‌లోని తన బంధువులో ఇంట్లో ఓ కార్యానికి వచ్చాడు. సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా సిద్దిపేట నుంచి వస్తున్న టీఎస్ 36 టీ 4777 నంబర్ గల కారును డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న కనకయ్యను ఢీకొట్టాడు. అతను అక్కడికక్కడే మృతిచెందాడు. తప్పించుకునే క్రమంలో కారును అటుఇటు తిప్పడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారు దిగిన డ్రైవర్ కనకయ్య మృతదేహాన్ని ఓ పక్కకు పడేసి కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. మృతుడి బంధువులు, గ్రామస్థులు అక్కడి చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. తొగుట పోలీసులు నచ్చజెప్పినా వారు వినలేదు. దాదాపు నాలుగు గంటల పాటు మృతదేహంతో ఆందోళన చేశారు. ఈ విషయమై తొగుట ఎస్ఐ రవికాంత్‌రావును వివరణ కోరగా ఇంత వరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కారులో మద్యం బాటిళ్లు ఉండడంతో డ్రైవర్ తాగి డ్రైవింగ్ చేశాడా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చదువుల బడి పిలుస్తోంది

- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై దృష్టి
- పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కసరత్తు
- సామర్థ్యాల పెంపుపై టీచర్లకు శిక్షణ
- పర్యవేక్షణ అధికారులకు రెసిడెన్షియల్ శిక్షణ
- పకడ్బందీగా బడిబాట నిర్వహణకు ఏర్పాట్లు


కొండపాకలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

కొండపాక, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమం ద్వారా సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొన్నేళ్లుగా పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో దీనికి చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపు కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, యువకులు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేసేలా ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రణాళికలు పకడ్బందీగా అమలు చేసేలా కార్యాచరణను రూపొందించారు. జిల్లాలో మొత్తం 941 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 80 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు.

ప్రధానంగా బడుల్లో చిన్నచిన్న మరమ్మతులను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా పూర్తి చేయిస్తున్నారు. డిజిటల్ బోర్డులను అందించింది. అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. పారిశుధ్య కార్మికులను పాఠశాలలకు నియమించింది. పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ఈ నెల 6 నుంచి 19 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకూ నోట్‌బుక్స్

ఇప్పటివరకూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులకు మాత్రమే నోట్‌బుక్స్ అందించేవారు. ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ చదివే విద్యార్థులకూ వర్క్‌బుక్స్‌తో పాటు నోట్ పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే డీఈవోల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించారు. పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

ఉపాధ్యాయులకు శిక్షణ

బోధనా నైపుణ్యాలు పెంచేందుకు సర్కారు ప్రభుత్వ టీచర్లకు ప్రత్యేకంగా శిక్షణ క్లాసులు ప్రారంభించింది. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు.. ఇలా అన్ని కేటగిరీల వారికి సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి వివిధ అంశాలపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచనున్నారు. ఇందుకోసం పర్యవేక్షణాధికారులైన మండల విద్యాశాఖ అధికారుల నుంచి, జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణను పూర్తి చేశారు.



వెరైటీ వెడ్డింగ్ కార్డు

చిన్నకోడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పెండ్లి పత్రికల్లో సంస్కృత పదాలను వాడుతుంటారు. అయితే చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌కు చెందిన ఓ యువకుడు తెలంగాణ యాసతో వెరైటీగా పెండ్లి పత్రికను అచ్చు వేయించాడు. ఇబ్రహీంనగర్‌కు చెందిన కాసర్ల రవీందర్ పెండ్లి నేడు (గురువారం) జరగనున్నది. తన పెండ్లిపత్రికలో సంస్కృత పదాలకు బదులు తెలంగాణ యాసతో ముద్రించడం అందరినీ ఆకట్టుకున్నది. తెలంగాణ యాసపై ఉన్న మక్కువతో తన పెండ్లి పత్రికను ఇలా అచ్చు వేయించానని రవీందర్ తెలిపారు. వరుడి బంధువులు, మిత్రులు ఈ వెరైటీ వెడ్డింగ్ కార్డును ఆసక్తిగా చదువుతున్నారు.

మోదుగాకుల్లోనే తిందాం

- ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగంతో అనారోగ్యం.. పర్యావరణానికి ముప్పు
- సిద్దిపేట జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో విస్తర్ల తయారీ
- ఒక్కరోజే 13,650 మంది మహిళలతో 61,500 తయారు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

7














ముప్పిరెడ్డిపల్లిలో గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మనోహరాబాద్ జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఎండు గంజాయి పట్టుకున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ముప్పిరెడ్డిపల్లిలో ఎండు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు నర్సాపూర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నివాసముంటున్న బీహార్‌కు చెందిన ఆదియ రాజు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా 221 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ మాదక ద్రవ్యాల చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి, మెదక్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. దాడిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా, ఎస్ఐ ఖాజా అజీజ్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ అబిద్ హుస్సేన్, అనిల్, రామకృష్ణ, సందీప్ పాల్గొన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలపాలని పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి



దామోదర్‌రెడ్డి(ఫైల్)

నర్సాపూర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై మండలంలోని లింగాపూర్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన నాయిని దామోదర్‌రెడ్డి(70) నర్సాపూర్ నుంచి పిల్లుట్లకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడు బీఆర్ఎస్‌లో ముఖ్య నాయకుడిగా, మాజీ ఉపసర్పంచ్‌గా పనిచేశాడు.

మంజీరాలో దూకి వివాహిత ఆత్మహత్య

మనూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మంజీరానదిలో దూకి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం రాయిపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శశికళ(46) కుటుంబ సభ్యులతో తగాదాలు రావడంతో బుధవారం ఉదయం మంజీరాలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సమాచారమందుకున్న మనూరు ఎస్ఐ శంకరయ్య హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని మంజీరాలోంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారని గ్రామస్థులు వివరించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు మనూరు ఎస్ఐ శంకరయ్య తెలిపారు.


గుండెపోటుతో ఆర్ఎంపీ వైద్యుడు మృతి



బైద్య అనంతకుమార్(ఫైల్)

నాగల్‌గిద్ద, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇరక్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన బైద్య అనంత్‌కుమార్(45) ఇరక్‌పల్లి గ్రామంలో సుమారు 20 సంవత్సరాల నుంచి ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ఆర్ఎంపీ వైద్యుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి రాక పోవడంతో ఇంటి యజమాని వడ్ల చంద్రశేఖర్ కిటికీల నుంచి చూడగా విగతజీవిగా కింద పడి ఉన్నాడన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ బి.సాయిలు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.











పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటిస్టు డా.అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటిస్టు డా.అరుణ

జహీరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ సెంటిస్టు డా.అరుణ, జిల్లా నోడల్ అధికారి వరప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హుగ్గెల్లి, బాబానగర్ తదితర ప్రాంతాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారు మాట్లాడుతూ చిరుధాన్యాలసాగు, ప్యాకేజీ, ఉత్పత్తిదారులు అమ్ముకునే విధానాలు, తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏవో లావణ్య, ఉద్యానశాఖ అధికారి పండరి, శాస్త్రవేత్తలు శైలజ, స్నేహలత, సాయిప్రియాంక, కైలాష్ తదితరులు మాట్లాడుతూ వివిధరకాల పంటలసాగుపై అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా శాస్త్రవేత్తల, అధికారులను స్పందించి వారిచ్చిన సలహాలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 35 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో జరిగిన ద్వితీయ భాష పరీక్షకు 40 మందికి 5 మంది హాజరుకాగా 35 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

గీతం అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఝాన్సీ రాణి తిరుమలశెట్టికి పీహెచ్‌డీ లభించింది. హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయం (జేఎన్ టీయూహెచ్) నుంచి సీఎస్ఈలో ఆమె పీహెచ్‌డీని పొందారు. జేఎన్ టీయూ 13వ స్నాతకోత్సవంలో ఉప కులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్‌రెడ్డి ఝాన్సీకి పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ఆమెను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, ఆయా విభాగాల అధిపతులు, డైరెక్టర్లు అభినందించారు.

గెజిటెడ్ హోదా కల్పించండి

● మంత్రికి పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల వినతి



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూర్యకాంత్, రఘు, సంఘం నాయకులు సుభాష్, వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు



మాధుర అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన కుళ్లిన గుడ్లు

హత్నూర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం సరఫరా చేసిన కోడిగుడ్లు పూర్తిగా కుళ్లిపోయి రావడంతో వాటిని ఎలా తినాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తూ చిన్నారులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటే.. ఇక్కడ మాత్రం పాడైన గుడ్లు సరఫరా చేస్తూ వాటిని తినకుండా చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో కుళ్లిన గుడ్లు తరుచూ సరఫరా చేస్తుండటంతో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండలం మాధుర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గుడ్లు పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో ఇండ్లలోకి తీసుకెళ్లిన ప్రజలు వాటిని చూసి ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. తరుచూ అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తున్నారని, వాటిని గమనించకుండా తింటే జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుడ్ల సరఫరాపై పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అక్కడక్కడ అంగన్‌వాడీ కేంద్రాలకు ఇలాంటి గుడ్లు సరఫరా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. 20 రోజుల గుడ్లను ఒకేసారి ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కుళ్లిపోయిన గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేణుకా ఎల్లమ్మకు సీపీఐ నేత చాడ పూజలు

హుస్నాబాద్ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవిని బుధవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సుగుణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఇఓ కిషన్ రావు చాడ వెంకటరెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. ఇందులో రేకొండ సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్, ఆలయ అర్చకులు పరమేశ్వర్ తదితరులున్నారు.



చాడను సన్మానిస్తున్న ఆలయ ఈవో కిషన్‌రావు

మోదుగాకుల్లోనే తిందాం

ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగంతో అనారోగ్యం.. పర్యావరణానికి ముప్పు

- సిద్దిపేట జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో విస్తర్ల తయారీ
- ఒక్కరోజే 13,650 మంది మహిళలతో 61,500 తయారీ
- తయారీ యూనిట్‌కూ సన్నాహాలు!

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మోదుగు విస్తర్లతో మహిళలు

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేటి కంప్యూటర్ యుగంలో మానవుడు ప్రకృతి 'ప్రసాదా'లకు క్రమంగా దూరమవుతున్నాడు. భూతల్లి అందించే సహజ వనరులను అందిపుచ్చుకునే అవకాశం లేక పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ప్లాస్టిక్ భూతాన్ని ఆశ్రయిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ రోజుల్లో ఏ ఫంక్షన్‌లోనైనా భోజనాలంటే గుర్తొచ్చేది ప్లాస్టిక్‌తో తయారు చేసే పేపర్ ప్లేట్లే. వీటిలో తింటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలొస్తాయని తెలిసినా ప్రత్యామ్నాయం లేకపోవడంతో తప్పడంలేదు. వీటివల్ల పర్యావరణానికి కూడా తీవ్రమైన ముప్పు ఏర్పడుతుంది. ఒకప్పుడు పొలం దగ్గర విరివిగా దొరికే మోదుగు ఆకులను సేకరించి ఇంటివద్ద కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ విస్తర్లు కుట్టేవారు. అలాంటిది ఇప్పుడు యాంత్రిక జీవనంలోకి రెడీమేడ్‌గా రంగురంగులతో తయారు చేసిన ప్లాస్టిక్ విస్తర్లే దిక్కుగా మారాయి. వనభోజనాలకు వెళ్లినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులనే తీసుకెళ్లి వినియోగిస్తున్నారు. ఇందులో వేడివేడి మటన్, చికెన్ కర్రీలు వేసుకొని భోజనం చేయడం వల్ల అందులో రసాయనాలు కరిగి పాలిథిన్ పదార్థం మనిషి శరీరంలోకి చేరుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడడంతో పాటు కేన్సర్‌కు దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.



విస్తర్ల తయారీకి శ్రీకారం..

ప్లాస్టిక్ ప్లేటకు ప్రత్యామ్నాయంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారి దేవకి దేవి ఆధ్వర్యంలో కలెక్టర్ మను చౌదరి ఆదేశాల మేరకు మోదుగు ఆకులతో విస్తర్ల తయారీకి శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాలు, యువకులు, యువతులకు అవగాహన కల్పించి తయారు చేయిస్తున్నారు. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మోదుగాకు విస్తర్ల తయారీతో ఉపాధి కూడా ఉంటుందని మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో మోదుగు విస్తర్ల యూనిట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 13,650 మంది మహిళలు 61,500 మోదుగు ఆకు విస్తర్లు తయారు తయారుచేసి రికార్డు సృష్టించారు. మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను కలెక్టర్ మను చౌదరికి జిల్లా పంచాయతీ శాఖ అధికారి దేవకీ దేవి అందజేశారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

హుస్నాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూమిపై ఉన్న జీవరాసులు, జనజీవనం సక్రమంగా సాగిపోవాలంటే వాతావరణ పరిస్థితులు సక్రమంగా ఉండాలి. ఇప్పటికే పర్యావరణ పరిరక్షణను పట్టించుకోక పోవడంతో అనేక విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అడవులు అంతరించి పోవడం, ప్లాస్టిక్ వాడకం, గుట్టలను ధ్వంసం చేయడంతో అతివృష్టి అనావృష్టి సంభవిస్తున్నాయి. పర్యావరణాన్ని పెంపొందించుకునేందుకు విరివిగా మొక్కలు నాటి పెంచాలి. వాటర్ షెడ్లను నిర్మించడంతోపాటు చెరువులు, కుంటలు, సరస్సుల పూడిక తీస్తూ ఉండాలి. ప్లాసిక్‌కు బదులుగా పేపర్, జ్యూట్, కాటన్ సంచులను వినియోగించాలి. బంజెరు భూములను అభివృద్ధి చేసుకోవాలి,

సిద్దిపేట జిల్లాలో అడవి 6.4శాతమే...

సిద్దిపేట జిల్లాలో 6.4శాతం (23,336 హెక్టార్లు) అటవీ భూమి మాత్రమే ఉంది. జాతీయ అటవీ విధానం ప్రకారం 33శాతం ఉండాలి. అలాగే హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, మద్దూర్, చేర్యాల, బెజ్జంకి మండలాల్లో 3,900 హెక్టార్లలో రిజర్వ్ ఫారెస్ట్ ఉండగా ఇది 5 నుంచి 10 శాతం మాత్రమే.

ప్రజలు ప్లాస్టిక్‌ను వాడొద్దు..



పరిశుభ్రమైన ప్రకృతి కోసం ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పండి. ప్రజలు ప్లాస్టిక్ వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. జిల్లాను ప్లాస్టిక్ రహిత మర్చేందు అందరు కృషి చేమాలి. ఇండ్లల్లో ఫంక్షన్ అయినా మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను వాడుకోవాలి.

-సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

పాత రోజులు రావాలి



జిల్లాను ప్లాస్టిక్ రహితగా మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. మహిళలకు, యువకులకు మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ పై అవగాహన కల్పిస్తున్నాం. విస్తరాకుల తయారీ చేస్తే పర్యావరణానికి మేలు చేయడంతో పాటు వారికి ఉపాధి కూడా ఉంటుంది. గతంలో ఏ ఫంక్షన్ అయినా మనము మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను వాడుకునే వాళ్ళం. మళ్లీ ఆ పాత రోజులు రావాలని ఆశిస్తున్నాం

-దేవకీదేవి, జిల్లా పంచాయతీశాఖ అధికారి



10 రోజుల క్రితం కురిసిన వర్షానికి పొంగిపొర్లుతున్న వాగును దాటలేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఈసారీ దాటవెతలే

- నిర్మాణానికి నోచుకోని ప్యాలవరం బ్రిడ్జి
- రూ. 3కోట్లతో ఆరు నెలల క్రితం శంకుస్థాపన
- వర్షకాలంలోపు పూర్తి చేస్తామని హామీ
- ఇప్పటికీ ప్రారంభంకాని పనులు
- వాగొస్తే రాకపోకలు తీవ్ర ఇబ్బందులు



బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్ (ఫైల్)

ఝరాసంగం, జూన్4(ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండల పరిధిలోని ప్యాలవరం వాగు ఏటా వానకాలంలో పొంగిపొర్లుతుండడంతో గ్రామస్థులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం ఈ వాగు పై నూతనంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. అంతేకాకుండా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. రానున్న వానకాలంలోపు బ్రిడ్జి నిర్మాణాని పూర్తి చేస్తామని వారు అప్పట్లో ప్రజలకు భరోసా ఇచ్చారు. దీంతో ఎన్నో ఏళ్ల అవస్థలకు చెక్ పడుతుందని గ్రామస్థులు భావించారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభంకాకపోవడంతో ఈ సారీ కూడా ఇక్కట్లు తప్పడం లేదు. 10 రోజుల క్రితం కురిసిన వర్షానికి వాగు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

రాకపోకలకు తప్పని ఇబ్బందులు

ఎన్నో సంవత్సరాల నుంచి ప్యాలవరం వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు వర్ష కాలం వచ్చిందంటే నానా తంటాలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పనులు వేగవంతంగా చేస్తుందనుకుంటే.. కాలయాపనకే పరిమితమైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ముఖ్యంగా ప్యాలవరం, దేవరంపల్లి గ్రామానికి రాకపోకలు సాఫీగా సాగుతాయి.

ప్రతీ ఏటా తిప్పలే..



ఏటా వాగు ఉధృత్తంగా ప్రవహిస్తుండడంతో రాకపోకుకు ఇబ్బందులు పడుతున్నాం. నీళ్ల తగ్గుముఖం పట్టేంతవరకు నిరీక్షిణ తప్పడంలేదు. తప్పని పరిస్థితుల్లో దేవరంపల్లి మీదుగా చుట్టూ తిరిగి జహీరాబాద్ పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది.

-మాణిక్యం యాదవ్, ప్యాలవరం

స్థిర ప్రణాళికలతో ఐఐటీల్లో చేరండి

- ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఉండాలి
- ఉద్యోగాలను సృష్టించే స్థాయిలో ఆలోచనలు చేయాలి
- జేఈఈ ఓపెన్ డేలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



మాట్లాడుతున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. స్థిరమైన ప్రణాళికలతో ఐఐటీలలో చేరాలని, ఐఐటీ విద్యార్థులంటే ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయిలో ఆలోచనలు చేయాలన్నారు. జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (జేఈఈ)లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీల్లో సీటు పొందాలని ఆశించే విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో బుధవారం జేఈఈ ఓపెన్ డే-2025 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర నలుమూలల నుంచి వందలాది మంది జేఈఈ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి.. ఐఐటీలో ఎందుకు చదవాలి, ప్లేస్‌మెంట్స్ ఎలా ఉంటాయి, ఇంటర్న్‌షిప్‌లు, వినూత్న అవకాశాలు, ఆవిష్కరణలు, సాంకేతికతలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వినూత్న విద్యా విధానం. అత్యాధునిక పరిశోధనలు, పర్యావరణం, ఐఐటీహెచ్ విద్యార్థులు సాధించిన విజయాలు, ఆవిష్కరణలు, నూతన పరిశోధనలు తదితరాల గురించి వివరించారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనూ ఇదే సెషన్‌ను నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శంకర్‌నాయక్ (ఫైల్)

కౌడిపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని బుజరంపేట పీర్యాతండాలో బుధవారం జరిగింది. రైతు నేనావత్ శంకర్‌నాయక్(48) పొలంలో ఉన్న బోరు మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు వెంటనే కౌడిపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ ఫలితం లేక పోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే చనిపోయినట్లు వైద్యు తెలిపారు.

హుస్నాబాద్‌లో రైతు మహోత్సవం

- 6 నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హాజరుకానున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం, కొండా
- నియోజకవర్గం నుంచి 5వేల మంది రైతులను తరలించేందుకు 100 బస్సులు సిద్ధం
- వ్యవసాయ రంగానికి సంబంధించిన 108 స్టాళ్లు



వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లు

హుస్నాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 6,7,8 తేదీల్లో హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ రైతు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ హాజరుకానున్నారు. మొదటి రోజు హుస్నాబాద్ నియోజకవర్గంలోని 5వేల మంది రైతులను 100 బస్సుల ద్వారా తరలించనున్నారు. రెండవ రోజు సిద్దిపేట, చేర్యాల డివిజన్‌కు చెందిన 3000, మూడవ రోజు ములుగు, గజ్వేల్, దుబ్బాకకు 3000 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన, ముఖాముఖి, వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నారు. రైతులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్‌పీవోలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రైవేట్ కంపెనీలకు చెందిన 108 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంర్ధక, మత్స్య శాఖకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, అవార్డు గ్రహిత రైతులు, అభ్యుదయ రైతులతో అవగాహన, ముఖాముఖీ కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లలో అధికారులు..

రైతు మహోత్సవానికి ఇంకా ఒక్క రోజే మాత్రమే ఉండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జర్మని టెంట్లతో స్టాళ్ల ఏర్పాటు చేశారు. దాదాపు 5 వేల మంది కూర్చుండే విధంగా హాల్, అందులోనే వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భోజనం చేసేందుకు ప్రత్యేకంగా టెంట్లు వేస్తున్నారు. రైతులను బస్సుల్లో తీసుకువచ్చి, తిరిగి గ్రామాల్లో దించనున్నారు. ఏర్పాట్లను జిల్లా వ్యవసాయ అధికారి రాధిక బుధవారం పర్యవేక్షించారు. మార్కెట్ యార్డును ఏసీపీ సదానందం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆధునిక వ్యవసాయంపై పరిజ్ఞానం పెంచేందుకే..

అత్యాధునిక వ్యవసాయంపై రైతులకు పరిజ్ఞానం పెంచేందుకు ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. కొత్తగా వచ్చిన విత్తనాలు, రైతులు ఇప్పటివరకు వినియోగించని పనిముట్లు వంటివి ఇందులో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

న్యూస్ బాక్స్

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వాహనదారులకు, ప్రజలకు రాంగ్‌సైడ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ తప్పిదం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో ప్రయాణించే వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

యువతి వివాహానికి దాతల సహకారం

గజ్వేల్ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని అనాధ యువతి వివాహానికి మేమున్నామంటూ మానవతావాదులు మానవత్వంతో ముందుకు వచ్చి వివాహ పెద్దలుగా మారి చిన్నారి వివాహం జరిపించారు. ఎవరూ లేరని అధైర్య పడవద్దని, అండగా ఉంటామని గోలి మమతసంతోష్ దంపతులు బుధవారం పుస్తెమట్టెలు అందజేశారు. అనూష-మధుల వివాహానికి హాజరై వారిని ఆశీర్వదించి దాతలు బహూకరించిన పెళ్లి సామగ్రిని అందజేశారనిసిద్దిపేట జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు డా. దేశబోయిన నర్సింహులు, రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు అన్నారు.

బాల్య స్నేహితుడి పిల్లలకు 20వేల ఆర్థిక సాయం

మర్కుక్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం నర్సన్నపేట గ్రామంలో గుండెపోటుతో మరణించిన భిక్షపతి బాల్య మిత్రులు 1997-98 బ్యాచ్ 10వ తరగతి మిత్రులు కలిసి తన స్నేహితుడు భిక్షపతి కుటుంబ సభ్యులకు 20వేల రూపాయల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో దుద్దెడ రాములుగౌడ్, డా. వెంకట్, బీబీఆర్ నరేష్‌గుప్త తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని గజ్వేల్ తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, బెజుగామ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో 250 ఆయా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు

మోతే వంజరికుంటపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మిరుదొడ్డి, జూన్4 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలోని వంజరికుంటను రియల్‌స్టేట్ వ్యాపారి కబ్జాచేశారంటూ బుధవారం మోతే మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఒక వ్యాపారి 40 ఎకరాల భూమిని కొనుగోలు చేశారనీ, ఆ భూమితోపాటు కొంతమంది రైతుల భూములు, వంజరి కుంటను కూడా కబ్జాచేశారని ఆరోపించారు. వెంటనే వంజరి కుంట చెరువును రక్షించాలని వారు డిమాండ్ చేశారు. .

మిరుదొడ్డిలో 100 దరఖాస్తులు

మిరుదొడ్డి, జూన్4 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 100 దరఖాస్తులు అందినట్లు మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వేతనాలు విడుదల చేయాలి

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా ఈఎంఆర్ఐ 1962 పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సిబ్బందికి నిధులు రావడం లేదని, వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున అంబులెన్స్ ఉందని, అందులో నిత్యం వెటర్నరీ డాక్టర్, ప్యారవేట్, డ్రైవర్, అటెండర్ విధులు నిర్వహిస్తారని, మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తారన్నారు. అవి కూడా సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ, ఇళ్లు గడవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పుస్తె, మెట్టెలు అందజేత

మద్దూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో అందించిన పుస్తెమెట్టెలను కొండాపూర్‌లో పాల డైరీ సభ్యుడైన అజ్మీరా జగ్గు కూతురు అజ్మీరా మౌనిక వివాహానికి అందించినట్లు చైర్మన్ అల్లం రాజు తెలిపారు.

కనుమరుగవుతున్న బోర్లు

చిన్నకోడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో ప్రజల నీటి అవసరాలు తీర్చిన బోర్లు(హ్యాండ్ పంపులు) నేడు భూ గర్భంలో కలుస్తున్నాయి. ఊట బావుల అనంతరం కరెంట్ అవసరం లేకుండా బోర్లు ఉపయోగంలోకి వచ్చాయి. ఈ హ్యాండ్ పంపులు సుమారు 50 అడుగుల లోతు నుంచి నీటిని పైకి అందించేవి.

హ్యాండ్ పంపులు మరమ్మతు గురి అయితే మండల ప్రజా పరిషత్ ద్వారా అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి సరఫరా చేసే వారు. కాలక్రమేణ భూగర్భజలాలు మరింత కిందికి చేరడంతో విద్యుత్ బోరు మోటారు ఉంటేనే నీటిని తీసుకోవడం సాధ్యమవడంతో చాలా వరకు గ్రామాల్లో హ్యాండ్ పంపులను తొలగించి సింగిల్ పేజ్ బోరు మోటారులను బిగించారు. కొన్ని గ్రామాల్లో ఉన్నప్పటికీ ప్రజలు వాటిని వినియోగించకపోవడం, కొన్ని చోట్ల బోర్లు కనుమరుగవుతున్నాయి.




పెద్దకోడూరులో సీసీ రోడ్డులో కూరుకు పోయిన బోర్లు

సులువుగా డబ్బులు సంపాదించాలని గంజాయికి అలవాటు

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయికి అలవాటుపడిన ముగ్గురు యువకులు పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు. బుధవారం సాయంత్రం చేర్యాల సీఐ ఎల్. శ్రీను విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేర్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రంగు రాజు, కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన సింగసారం మహేశ్, సార్ల నవీన్‌ల మధ్య కొన్నాళ్లక్రితం స్నేహం ఏర్పడిందన్నారు. ఈక్రమంలో గంజాయి సేవనానికి అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో హైదరాబాద్‌లో ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలుచేసి తాము సేవిస్తూ ఇక్కడ విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేపట్టామన్నారు. దీంతో నిందితుల వద్ద 100గ్రాముల గంజాయి, మూడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

బెజ్జంకి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేసి వారి కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బెజ్జంకిలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి ఆయన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు.ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. అనంతరం బెజ్జంకిలో ఓ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఆయా గ్రామాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కలగానే కార్పొరేషన్

(5వ పేజీ తరువాయి)

నిధుల విలువ పెరుగుతుందని గతంలో భావించారు. అందుకే సిద్దిపేట చుట్టుపక్కల ఉన్న ఎన్సాన్‌పల్లి, బూర్గుపల్లి, తడ్కపల్లి, మిట్టపల్లి, పొన్నాల, మందపల్లి తదితర గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్‌గా మార్చాలని తలంచారు. అయితే ప్రతిపాదనల దశలోనే ఇది నిలిచిపోయినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జాబితాలో ఈ విషయం స్పష్టం కావడంతో కార్పొరేషన్ హోదా మరో 5ఏళ్లు పెండింగులో పడినట్లుగానే తేలిపోయింది. ఫలితంగా సిద్దిపేట శివారు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలే జరుగుతాయని అర్థమైంది. నిన్నటిదాకా ఈ గ్రామాల్లోనూ ఆశావహులు తర్జనభర్జన పడ్డారు. తాజా పరిణామాలతో పంచాయతీ, స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.

గజ్వేల్ ప్రస్తావనేది?

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన తొగుట, కొండపాక మండలాల్లోని గ్రామాల నిర్వాసితులకు గజ్వేల్ పట్టణ శివారులో ఆర్అండ్ఆర్ కాలనీలు నిర్మించారు. సంగాపూర్, ముత్రాజ్‌పల్లి ప్రాంతాల్లోనే ఈ నిర్వాసిత కాలనీలను ఏర్పాటు చేశారు. దీంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణం విస్తరించింది. ప్రస్తుతం గజ్వేల్‌లో 20 వార్డులు ఉండగా నిర్వాసిత గ్రామాల కలయికతో 30 వార్డులకు పెంచవచ్చనే అభిప్రాయాలు నెలకొన్నాయి. 30వార్డులతో పెద్ద మున్సిపాలిటీగా మారుతుందనే అంచనా ఉండేది. కానీ జాబితాలో చోటు దక్కకపోవడంతో 20వార్డులతోనే గజ్వేల్ మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక మల్లన్నసాగర్ గ్రామాలకు పంచాయతీ హోదానే కొనసాగిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ

అంతరాలు లేని సమాజమే సీపీఐ లక్ష్యం

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అంతరాలు లేని సమాజమే సీపీఐ లక్ష్యమని సిద్దిపేట సీపీఐ కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ గజ్వేల్ మండల 17వ మహాసభ సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ఇందిరచౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం గుండా కోలా అభిరామ్ గార్డెన్ వరకు పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు బట్టు దయానందరెడ్డి గారు సీపీఐ పతాక ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధిగా సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ హాజరై మాట్లాడుతూ. ఈ దేశంలో పీడితుల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులపై మేధావులపై ఉ.పా చట్టాలను ప్రయోగిస్తూ జైలులో నిర్బంధిస్తున్నారని, సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడం కోసం పాలక ప్రభుత్వాలను ప్రశ్నిస్తే, ఈ దేశంలో ఉండకూడదనే ముద్ర వేస్తున్నారన్నారు.

భూమి లెక్కలు ఎక్కడా?

(5వ పేజీ తరువాయి)

జరిగినట్లు అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సర్వే ఆధారంగానే ఇంటి యాజమాన్య పత్రాలు అందించే అధికారాన్ని సబ్ రిజిస్ట్రార్లకు అప్పగించారు.

1993లో గ్రామ కంఠం రివిజన్

ఇంటి కొలతలు, ఇంటి యజమానుల గుర్తింప కోసం ఐదేళ్లకోసారి రివిజన్ జరపాల్సి ఉంటుంది. ఇలాంటి రివిజన్ 1993లో జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రివిజన్ చేయకపోవడంతో సంబంధిత రికార్డులు గ్రామ పంచాయితీల్లో లేవు. రికార్డులు లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా కొలతలు ఎక్కువ తక్కువ నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో చాలా చోట్ల వివాదాలు తలెత్తుతునానయి. జిల్లాలో ఎక్కువ శాతం పోలీస్‌స్టేషన్, ప్రజావాణిలో ఇలాంటి దరఖాస్తులే వస్తున్నాయి.

ప్రైవేట్ సర్వేయర్లే..

గ్రామాల్లో భూముల కొలతలకు ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లే దిక్కయ్యారు. వీరి కొలతలే భూముల రిజిస్ట్రేషన్‌కు ప్రామాణికంగా తీసుకోవడంతో భవిష్యత్‌లో గ్రామ కంఠం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేస్తాం



విలేకర్లతో మాట్లాడుతూన్న మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని మండల పార్టీ అధ్యక్షుడు మేడికాయల శ్రీనివాస్ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మండల ప్రధాన కార్యదర్శులుగా గడ్డం శ్రీకాంత్ గౌడ్,ఆకుల మహేష్, ఉపాధ్యక్షుడిగా చుక్క రామచంద్రం, బోయిని బాబు, మునిగెల స్వామి,చొప్పరి బాబు, కార్యదర్శిగా అకోజు సాయి, కోశధికారిగా బల్ల శ్రీనివాస్ లను నియమించడం జరిగిందన్నారు. గ్రామాల్లో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తామని, మండల అభివృద్దిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తామని పెర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రమేష్ గౌడ్ సీనియర్ నాయకులు బాపురెడ్డి, రామచంద్రం, మాజీ మండల అధ్యక్షులు బుగ్గరాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఆరేపల్లిలో బొడ్రాయి పునః ప్రతిష్ఠ ఉత్సవాలు

రాయపోల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం పెద్దారెపల్లి గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

పట్టాలు పునరుద్ధరించాలని వినతి

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గతంలో దళితులకు కేటాయించిన పట్టాభూములను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ అందె అశోక్ తదితరులు అధికారులకు వినతిపత్రం అందించారు.

7న టీవీఏసీ జేఏసీ సమావేశం



కే.కనకరాజు

సిద్దిపేట రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం మెదక్ పట్టణంలో నిర్వహించనున్నట్లు యూనైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ సిద్దిపేట డివిజన్ కార్యదర్శి కే.కనకరాజు రాఘవాపూర్‌లో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కే.కనలకరాజు మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ఏకైక డిమాండ్‌తో ఎనిమిది నెలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. ఈ నెల 18న కుటుంబ సభ్యులతో బహిరంగ సభ హైదారాబాద్‌లో నిర్వహించనున్న సందర్భంగా మెదక్‌లో 7న సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు.

పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు : ఏసీపీ

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : పశువుల అక్రమరవాణా చేస్తే చట్టపరచర్యలు తప్పవని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. బక్రీద్ పండగ నేపథ్యంలో చేర్యాల మండలం గుర్జకుంట క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టను బుధవారం ఏసీపీ సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పశువుల అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. ఒకవేళ పశుసంవర్ధకశాఖాధికారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తదితర డాక్యుమెంట్స్ పరిశీలిస్తే పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.

బెజ్జంకి పీహెచ్‌సీని సందర్శించిన అదనపు కలెక్టర్

బెజ్జంకి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ రిజిస్టర్, ఫార్మసీగదిని పరిశీలించారు. రోగులకు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను గురించి పీహెచ్‌సీ వైద్యురాలు మాధురిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన లక్ష్మిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీడీ హెంహెచ్‌వో ఆనంద్, తోటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణతేజ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విస్తర్లతో ప్లాస్టిక్ వినియోగం తగ్గు ముఖం

మద్దూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ సిద్ధంగా లభించే మోదుగు ఆకులతో తయారీ చేసే విస్తర్లతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. బుధవారం మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధిహామీ కూలీలు, మహిళా సంఘాల సభ్యులు తయారు చేస్తున్న విస్తర్ల కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మోదుగు ఆకులతో విస్తర్లు తయారు చేయించడం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసిన వారవుతారని అభినందించారు. త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే కిసాన్ మేళాలో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా మోదుగు ఆకులతో తయారు చేసిన విస్తర్లు వాడాలని సూచించారు.



విస్తర్ల తయారీలో మహిళా సంఘాల సభ్యులు



భూమిపూజ చేస్తున్న నర్సారెడ్డి

అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని 1వ వార్డులో పోచమ్మ దేవాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, బడ్జెట్ సమస్య ఉన్నా అభివృద్ధి పనులతో పాటు సంక్షేమాన్ని ఉరకలెత్తిస్తుందన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయవద్దు

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయవద్దని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో వంద రోజుల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పలు కార్యక్రమాలను చేపట్టారు. తడి, పొడి చెత్త, డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, మున్సిపల్ వాహనానికి చెత్తను ఇవ్వాలన్నారు. ముత్రాజ్‌పల్లి బరీచెరువు వద్ద ముళ్ల పొదలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ రవిందర్, ఆయా విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్‌లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

కిసాన్ మేళాను జయప్రదం చేయాలి: ఏవో

మద్దూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్‌లో నిర్వహించే కిసాన్ మేళాకు మద్దూరు, ధూళిమిట్ట మండలాల రైతులు తప్పక హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ అన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి కిసాన్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పాలక ప్రభుత్వంపై పోరాటాలు చేస్తుంది సీపీఐ



మాట్లాడుతూన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్

చిన్నకోడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆవిర్భావం నుంచి కష్టజీవుల కోసం కార్మిక కర్షక రైతాంగం కోసం నిరంతరం పాలక ప్రభుత్వం పై పోరాటాలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. చిన్నకోడూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న చిన్నకోడూరులో నిర్వహించబోతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మండల మహాసభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి సీపీఐ పార్టీ కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బంక రాజయ్య, నాయకులు మనేయ్య, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు ఇస్తాం

అక్కన్నపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 357 మందికి మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసామని తెలిపారు. మిగతా అర్హులైన వారికి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు.

దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌కుమార్

దుబ్బాక, జూన్4 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా తిరిగి రమేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో దుబ్బాకలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి, బదిలీపై కోహీర్ మున్సిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను దుబ్బాకకు తిరిగి బదిలీ చేశారు. ఆయన బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దుబ్బాకలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై సంగారెడ్డి మున్సిపాలిటీకి వెళ్లారు. నూతన కమిషనర్ రమేష్ కుమార్‌ను దుబ్బాక కాంగ్రెస్ నాయకులు కాల్వనరేష్, మచ్చశ్రీనివాస్, తునికిసురేష్ సన్మానించారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

జగదేవ్‌పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవంగల ఉపాధ్యాయులు బోధన ద్వారా నాణ్యమైన గుణాత్మకమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన తరగతిగదులు, డిజిటల్ బోధన, కంప్యూటర్ శిక్షణ, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, అల్పాహారంగా రాగిజావ, ఉచితంగా ఏకరూప దుస్తులు అందిస్తూ పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సును పరిశీలించిన ఆర్డీవో



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రకళ

కుకునూరుపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సు రెండవ రోజు బుధవారం మండలంలోని ఎల్లయ్యగూడ, పీటీ వెంకటాపూర్‌లో అధికారులు నిర్వహించారు. పీటీ వెంకటాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పత్రాలను పరిశీలించి ఏ విధంగా వాటిని పరిష్కరించాల్లో మండల రెవెన్యూ అధికారులకు సూచించారు.

అద్దంకి దయాకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో పార్టీకి అండగాఉండి కార్యకర్తలలో ధైర్యం నింపిన తెలంగాణ ఉద్యమకారుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ఉద్యమకోటాలో మంత్రి పదవి కేటాయించాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. చేర్యాల మండలకేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అద్దంకి దయాకర్ మూడు దశాబ్దాలుగా రాజ్యాంగ రక్షణకోసం పోరాడుతున్న సామాజిక ఉద్యమనేత అని, అన్ని వర్గాలవారికి అందుబాటులోఉండి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పార్టీలో కొనసాగారన్నారు. దళిత కోణంలో కాకుండా ఉద్యమకోటాలో మంత్రి పదవి ఇచ్చి ఉద్యమకారుల గౌరవాన్ని నిలబెట్టాలని కోరారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో తాడూరు జడ్పీఎస్ఎస్ పూర్వవిద్యార్థులు

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం తాడూరు జడ్పీఎస్ఎస్ 2002-03విద్యా సంవత్సరం పదవతరగతి విద్యార్థులు ఆత్మీయసమ్మేళనాన్ని బుధవారం ఘనంగా జరుపుకు న్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.